క్లుప్తంగా

పశు రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి



తాడిపత్రి అర్బన్: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసు అధికారులను కోరారు. బుధవారం పెద్దవడుగూరు సమీపంలో నేషనల్ హైవేపై కాసేపల్లి టోల్‌ప్లాజా వద్ద కంటైనర్ బోల్తా పడి ఇద్దరు వ్యక్తులతోపాటు 30కి పైగా పశువులు మృతి చెందడంపై ఎమ్మెల్యే ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన మూగజీవాలకు పశువైద్యాధికారులు వెంటనే చికిత్సను అందించాలని సూచించారు.

12న తొండపాడులో టెంకాయల వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి ఈ నెల 12న వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ దేవదాసు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెంకాయల వేలం పాటతో పాటుగా ఈ నెల 27 నుంచి 2025 పుష్యమాసం ఆఖరు వరకూ టెంకాయల విక్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ఉంటుందని తెలిపారు. రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

గుత్తి రూరల్: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఊబిచెర్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు రోజు బయో మెట్రిక్ ద్వారా తప్పకుండా హాజరు వేయాలన్నారు. కులగణన త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం పద్ధతి?



తరగతి గదిలో ప్రచారం చేస్తున్న నాయకులు

గుత్తి: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కాలేజీ తరగతి గదుల్లో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ నేత పెరుమాళ్ల జీవానందరెడ్డి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు రమణ, రంగస్వామిరెడ్డితో కలిసి తరగతి గదులకు వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారు. తరగతులు జరగకుండా టీడీపీ ప్రచారం చేయడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. టీడీపీ నేతల తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

వైభవంగా గంధం వేడుకలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

శింగనమల: స్థానిక హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజి దర్గాలో బుధవారం రాత్రి గంధం మహోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా దర్గాలో భక్తులు ఉదయం నుంచి చక్కెర చదివింపులు చేయించారు. గంధంను పురస్కరించుకొని రాత్రి పూల చాందినిని గ్రామంలో ఊరేగించారు

భక్తులకు ఎమ్మెల్యే అన్నదానం

గంధం మహోత్సవంను పురస్కరించుకొని బుధవారం రాత్రి దర్గాకు వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా సీఐ శ్రీధర్‌రాజు, ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

రేపు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మంజుల పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ మండలంలో 10,477 మంది 1 నుంచి 19ఏళ్లలోపు పిల్లలు ఉన్నారని, వారందరికీ నులిపురుగుల నివారణ మందులు వేయాలన్నారు. ఎంఈఓ వెంకటరమణ, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వ రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతో గ్రామస్వరాజ్యం సాకారం



శిరివరంలో పర్యటిస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నర్సింహయ్య



పాపినేపాళ్యంలో వీరాంజనేయులుకు హారతి పడుతున్న మహిళ

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

గార్లదిన్నె: సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్వరాజ్యం సాకారం చేశారని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం గార్లదిన్నె, జంబులదిన్నె, పాపినేపాళ్యం, తిమ్మం పేట, గుడ్డాలపల్లి,శిరివరం,కల్లూరు, ఇల్లూరులో ఆయన రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్యతో కలసి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా వీరాంజనేయులు ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. జగనన్న తాను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారని, మీ అందరి సహకారంతో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికీ కులం,మతం,పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే జగనన్నని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పని చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతుంటే ప్రతిపక్షాలు జగనన్న పాలనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తిప్పి కొట్టి జగనన్న చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, పేదరికం నిర్మూలన జరగాలంటే జగనన్న అధికార పీఠం ఎక్కాలన్నారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పైలా నర్సింహయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకట నారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామోహ్మన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఫిర్యాదు చేసినా డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగించడం లేదు'



కసాపురం ఓటర్ జాబితాలో పూలరమణ కుటుంబ సభ్యుల పేర్లు



గుంతకల్లులోని 15వ వార్డులో పూలరమణ కుటుంబ సభ్యుల పేర్లు

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామానికి చెందిన పూల రమణ, అతడి తల్లిదండ్రుల ఓట్లు ఎన్నో ఏళ్లగా ఇటు గ్రామంలోనూ, అటు గుంతకల్లులోనూ చలామణి అవుతున్నాయని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఓట్లు తొలగించడం లేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శిసోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూల రమణ వ్యాపార నిమిత్తం గత 30 ఏళ్ల క్రితం తన తల్లి దండ్రులతో కలిసి గుంతకల్లులోని బీఎస్ఎస్ కాలనీలో మార్కండేయ స్వామి టెంపుల్ వద్ద చేరారన్నారు. ఆ రోజు నుంచి ఈరోజు వరకూ పూల రమణతోపాటు, ఆయన తండ్రి రామాంజనేయులు, తల్లి పద్మావతి రెండు చోట్ల తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారన్నారు. మొదటి నుంచి టీడీపీలో ఉన్న ఈ కుటుంబం ఇటీవల జనసేనలోకి మారిందని ఆయన తెలిపారు. వీరి డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగించాలని పలుమార్లు బీఎల్వోకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని ఆయన వివరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న గేట్స్ డైరెక్టర్ వీకే వాణి

గుత్తి: రక్తదానం ప్రాణం దానంతో సమానమని అనంతపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు సుభాష్ అన్నారు. గుత్తిలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం అనంతపురం ప్రభుత్వాసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతపుం ప్రభుత్వాసుపత్రిలో రక్తం కొరత ఉన్నందున ఆసుపత్రి వైద్యులు గేట్స్ యాజమాన్యాన్ని సంప్రదించారు. ఈ క్రమంలో కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గేట్స్ కాలేజీ సీఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ వీకే వాణి మొదట రక్తదానం చేయగా వారిని స్ఫూర్తిగా తీసుకుని సుమారు 100 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సుభాష్ మాట్లాడుతూ ప్రతి మూడు మాసాలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందన్నారు. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సురయ, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తుకు భరోసా



ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకున్న లబ్ధిదారులు

తాడిపత్రి అర్బన్: జగనన్నతోనే పేదల భవిష్యత్తుకు భరోసా అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 25వ వార్డు సచివాలయ పరిధిలోని 30,31వ వార్డులకు సంబంధించి జగనన్న ఇంటి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మనోజ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. నిత్యం పేదల సంక్షేమం కోసం పరితపించే ఏకైక సీఎం వైఎస్. జగన్ అని అన్నారు. మహిళా సాధికారిత కోసం పథకాలన్నింటినీ వారి పేరుపైనే అందిస్తున్నారని గుర్తు చేశారు. ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన లబ్దిదారులు ఈసందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకుడు హనుమంతు, వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ నాగమ్మ, వీఆర్‌ఓ నాగజ్యోతి, ఎడ్యుకేషనల్ సెక్రటరీ నిఖిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ ఎస్‌ఐగా సాగర్



తాడిపత్రి: తాడిపత్రి రూరల్ నూతన ఎస్‌ఐగా జి. సాగర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మహమ్మద్ గౌస్ బదిలీపై గార్లదిన్నెకు బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న సాగర్ ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా కొత్త ఎస్‌ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతు ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

నార్పల: పులసలనూతల గ్రామంలో బుధవారం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీధర్(38) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవాడు. దీంతోపాటు నార్పల వైకేపీ కార్యాలయంలో యానిమేటర్‌గా పని చేశాడు. గతేడాది పొలంలో అరటి సాగు చేయగా వడగండ్లతో పంట నష్టపోయాడు. దాదాపు రూ.25 లక్షల దాకా అప్పులయ్యాయి. ఈ ఏడాది పంట దిగుబడి ఉన్నా ధర లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ బాలల హక్కులను పరిరక్షించాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బాలల హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు అధ్యక్షత వహించగా వక్తలు బాల్య వివాహాల నిషేధ చట్టం, పిల్లలపై లైంగిక దాడుల నిరోధక చట్టంపై వివరించారు. పిల్లల హక్కులకు భంగం కలిగితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వన్‌టౌన్ ఏఎస్‌ఐ పద్మావతి, బాలల పరిరక్షణ సమితి అధికారులు వెంకటేశ్వరీ, చంద్రకళ, సోషల్ వర్కర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని చెంబుల బావి వీధి, ఉచ్చూరప్ప వీధి అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె పిల్లలు, గర్భిణులు, బాలింతల రికార్డులను పరిశీలించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

బుక్కరాయసముద్రం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కొర్రపాడు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ సునీత పేర్కొన్నారు. బుధవారం కొర్రపాడు పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆమె రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంచి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత భాస్కర్‌రెడ్డి, డాక్టర్ వినోద్ కుమార్, సీహెచ్‌ఓ మోహన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్, సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆహార సంరక్షణపై అవగాహన



ఇండస్ట్రియల్ విజిట్‌లో పాల్గొన్న విద్యార్థులు

పామిడి: పట్టణ టీసీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులో భాగంగా బుధవారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ హెచ్‌ఎం కే రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆహార సంరక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక బెంగళూరు బేకరిలో కేకు, బ్రెడ్డు తయారీ విధానాన్ని నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, నాగేంద్రమ్మ, రమ్యకృష్ణ, రామతులసి, ఒకేషనల్ సత్యం, రంగప్ప, ఆరిఫ్‌బాషా, బాలయ్య, పద్మనాభరెడ్డి, ఆంథోని పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

పామిడి: స్థానిక పెన్షనర్ల హోంలో బుధవారం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సంఘం సభ్యులు వెంకటరమణ, విజయరాఘవన్, రామిరెడ్డి, ఖాశీం, వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, ఆదిరెడ్డి, ప్రభాకర్‌రావు, బసవరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పుట్లూరు: కుమ్మనమల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేశవనాయుడు అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

గోవుల అక్రమ రవాణా అరికట్టాలని వినతి

గుంతకల్లుటౌన్: గోవులను అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్‌డీఓ కార్యాలయ డీటీ ఉదయ్‌భాస్కర్‌ను బీజేపీ నాయకులు కోరారు. బుధవారం ఆర్‌డీఓ కార్యాలయంలో డీటీని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గుత్తి టోల్‌గేట్ వద్ద కంటైనర్‌లో పరిమితికి మించిన గోవులను అక్రమంగా తరలించడం కారణంగానే 40 ఆవులు మరణించాయన్నారు. ఆవుల అక్రమరవాణా, వీటి మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు సూర్యనారాయణ, మహేష్, ప్రభాకర్, రవి, బండిమురళీ, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రాఘవ్‌లు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : గోవులను హింసించే వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సింగరి లక్ష్మీనారాయణ, సీనియర్ నేత రాధాకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఎస్‌ఐ శ్రీనివాసులుతో మాట్లాడారు. పోలీసు అధికారులు తనిఖీలు చేసి గోవులను రక్షించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే నియోజకవర్గాభివృద్ధి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దేవేంద్రప్ప

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గ చరిత్రలో ఏ పార్టీ చేయని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ చేసి చూపిందని, ఈ ఘనత ముఖ్యమంత్రి జగనన్న, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికే దక్కుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జీ.దేవేంద్రప్ప స్పష్టం చేశారు. బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ రాజకీయ పార్టీల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్ అధ్యక్షత వహించగా వైఎస్సార్‌సీపీ నుంచి దేవేంద్రప్ప, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దౌల్తాపురం ప్రభాకర్, బీజేపీ గుర్రం సూర్యనారయణ, జనసేన బండి శేఖర్, సీపీఐ వీరభద్రస్వామి, సీపీఎం సునీల్, ఆమ్ ఆద్మీ మహమ్మద్‌గౌస్, జాతీయ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఆలంనవాజ్, మెప్మా రిటైర్డు ఉద్యోగి రామాంజినేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ గుత్తి. గుంతకల్లు నియోజవర్గంలో ఏర్పడి దాదాపు 69 ఏళ్లలో దాదాపు 14 సార్లు ఎన్నికలు జరిగాయన్నారు. ఇన్నేళ్లలో ఏ పార్టీ చేయని అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. గుంతకల్లులో బ్లడ్ బ్యాంకుతోపాటు దాదపు రూ.13 కోట్లతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌డీఓ కార్యాలయం , నాడు–నేడు కింద పాఠశాల అభివృద్ధి చేయడంతో పాటు విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత జగనన్నదే అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తు చేశారు. ఇక ఎమ్మెల్యే వైవీఆర్ తన సొంత నిధులతో రెండు అంబులెన్స్‌లు ఏర్పాటు, వైఎస్సార్, వైవీఆర్ క్యాంటీన్ పేరిట రూ.6కే భోజన సదుపాయం కల్పించారన్నారు. భారత రాజ్యాంగ అవగాహన వేదిక అధ్యక్షురాలు జింకల సరస్వతి, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం



మహిళకు కరపత్రం అందజేస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అన్ని వర్గాల వారికి నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేసి వారి వెలుగులు నింపిన సీఎం వైఎస్.జగన్‌కు అండగా నిలుద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. బుధవారం 24వ వార్డులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు నిత్యం అందుబాటులో ఉంటున్నారా అని వాకబు చేశారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే నన్నారు. గతంలో సంక్షేమ పథకాల కోసం కాళ్లరిగేలాట టీడీపీ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారన్నారు. కానీ నేడు జగనన్న పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబాఫకృద్దీన్, స్థానిక నాయకులు వేణు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిన్నేపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం



నూతన బోరును పరిశీలిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు తదితరులు

యాడికి: మండలంలోని పిన్నేపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వివరాలు.. వారం రోజుల క్రితం గ్రామంలో తాగునీటి బోరు ఎండిపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. సమస్యను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఎమ్మెల్యే 15వ ఆర్థిక సంఘంలోని రూ.4 లక్షల నిధులతో బోరు బావిని తవ్వించటంతో పుష్కలంగా నీరు లభించింది. బోరుబావిలోకి కొత్త మోటరు, పైపులు బిగించి బుధవారం నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో సర్పంచు అనూరాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, రామ్మోహన్, నాయకులు పండు శ్రీరాములు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. నీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పిన్నేపల్లె గ్రామసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

13 నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు



గుంతకల్లులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీనియర్ డీపీఓ చౌహాన్

గుంతకల్లుటౌన్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ వెలసిన సేవాఘడ్ క్షేత్రంలో ఈ నెల 13 నుంచి 15 వరకు వైభవంగా జరిగే జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని రైల్వే సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, ఏడీఎన్ రామస్వామి నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక భాగ్యనగర్‌లోని సేవాలాల్ గుడి వద్ద సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. సేవాలాల్ జయంతి, జగదంబ మాత వార్షికోత్సవాలకు దేశంలోని తండాల నుంచి బంజారా సోదర,సోదరీమణులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్ట్ అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, సభ్యులు రూప్లా నాయక్, తిరుపాల్‌నాయక్, సోమ్లానాయక్, నారాయణనాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఏపీఓ షబ్బీర్‌బాషా

యల్లనూరు: మండలంలోని ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ షబ్బీర్‌బాషా సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ తయారు చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాకముందే కొత్త పనులు ప్రతిపాదనలు రూపొందించి మంజూరు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీ బబ్లు, టీఏలు ప్రతాప్, శంకర్, జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

పామిడి: స్థానిక నిట్టూరు నిలయం పాఠశాలకు బుధవారం ప్రవాస భారతీయ వాసవీ సంఘం కో–ఆర్డినేటర్ ఎన్‌వీ సుబ్రమణ్యం రూ.22వేలు విలువ చేసే పుస్తకాలను వితరణ చేశారు. స్కూల్ హెచ్‌ఎం తులసిబాయి సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బసవరాజు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.